క్లుప్తంగా

అంకిత భావంతో పనిచేయండి



అధికారులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ సీఈఓ లలితాబాయి

ధర్మవరం రూరల్: విధుల పట్ల అంకిత భావంతో పనిచేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ లలితాబాయి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ సౌజన్య కుమారితో కలిసి పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో రోగాలు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని, తాగునీటి పైపు లైన్లు లీకేజీ ఉంటే నివారించాలన్నారు.

మంత్రి పెద్దిరెడ్డితో భేటీ



మంత్రి పెద్దిరెడ్డితో హరిప్రసాద్, వెంకటరమణ

కదిరి అర్బన్: చిత్తూరు జిల్లా కుప్పంలో మంగళవారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కదిరికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు.

వైఎస్సార్ బీమా అందజేత

ధర్మవరం రూరల్: గొట్లూరు గ్రామానికి చెందిన ఖాజీ యూసఫ్(38) అనే వ్యక్తి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సర్పంచ్ పిట్టా నరసమ్మ, ఉప సర్పంచ్ గంగాధర్, పంచాయతీ కార్యదర్శి గణేష్‌రెడ్డి మంగళవారం వెళ్లి యూసఫ్ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సహాయం రూ.10 వేలు అందజేశారు.

డాక్టరేట్ ప్రదానం



జగదీష్‌కుమార్‌కు డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

అమడగూరు: ఓడీచెరువు మండలం గౌనిపల్లికి చెందిన విద్యార్థి జగదీష్‌కుమార్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ఎస్కేయూ వృక్షశాస్త్ర విభాగంలో ఆచార్య చింతా సుధాకర్ పర్యవేక్షణలో నీటి ఎద్దడి, అధిక లవణీయత పరిస్థితులను తట్టుకుని పెరిగే వేరుశనగ మొక్కల అభివృద్ధి అంశంపై పరిశోధనలు చేశారు. సోమవారం జరిగిన వర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ పట్టా అందజేశారు.

వడ్డెర్ల సంఘం కమిటీ ఎంపిక

తలుపుల: స్థానిక ఏడుకొండలు ఫంక్షన్ హాల్‌లో మంగళవారం వడ్డెర్ల సంఘం మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా బత్తల శ్రీధర్, గౌరవాధ్యక్షుడిగా గంగరాజు, ఉపాధ్యక్షులుగా బత్తల శ్రీనాథ్, చల్లా రమణ, జనరల్ సెక్రెటరీగా దేవేంద్రను ఎంపిక చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కనగానపల్లి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తూ పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు రమాదేవి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కదిరి అర్బన్: బదిలీపై వెళ్తున్న చవిటితండాలోని పాఠశాల ఉపాధ్యాయుడు బాబా సాహెబ్‌ను హార్ట్ టు హెల్ప్ సంస్థ సన్మానించింది.

గాండ్లపెంట: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, శివారెడ్డి, వెంకటలక్ష్మీని ఎంఈఓ క్రిష్టానాయక్ ఘనంగా సత్కరించారు.

నల్లచెరువు: స్థానిక ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడు మహమ్మద్ అలీని సన్మానించి వీడ్కోలు పలికారు. ఎంఈఓ తిరుపాల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపునకు శ్రమించాలి



నగదు పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ ఆదాయం పెంపునకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని డిపో మేనేజర్ ఇనాయితుల్లా పేర్కొన్నారు. ఆదర్శ ఉద్యోగులకు డిపో ఆవరణంలో మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. 2023 జూన్ నెలలో ఇచ్చిన సర్వీస్ టార్గెట్‌కు మించి ఆదాయం తెచ్చిన ముగ్గురు కండక్టర్లు, ముగ్గురు డ్రైవర్లు శ్రీనివాసులు, రాయుడు, నాగార్జున, కేఎస్‌వాసులు, బీఎస్ వాసు, జేజే నాయక్, గంగాద్రి, తిరుపాలు, హరిబాబును ఘనంగా సన్మానించి నగదు పురస్కారాలు అందజేశారు. ఎస్టీవి పెద్దన్న, ఏఎంఎఫ్ ఎస్‌బీనాయక్, క్లర్క్ శోభారాణి, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కరోనాలోనూ వేకువజామునే పింఛన్

ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళపేరు పెద్దక్క వితంతువు. కదిరిలోని పట్నం గ్రామం. కరోనా సమయంలో బయటకు వచ్చేందుకు సైతం భయపడేపరిస్థితి. ఆ సమయంలో పట్నం వాలంటీర్ నాగేంద్ర తెల్లవారుజామున 5 గంటలకే ఇంటికి వెళ్లి పెన్షన్ అందించేవాడు. ప్రాణాలు లెక్కచేయకుండా మాస్క్ ధరించి చేతికి శానిటైజర్ పూసుకుని పింఛన్లు పంపిణీ చేశాడు. ఆపత్కాలంలో ప్రభుత్వం వలంటీర్ ద్వారా సకాలంలో పింఛన్లు అందజేయించింది.

–కదిరి అర్బన్



తెల్లవారుజామునే పెద్దక్కకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నాగేంద్ర (ఫైల్)

వలంటీర్లకు వందనం

వలంటీర్లకు రుణపడి ఉంటాం



గతంలో ఎన్నో ప్రభుత్వాలను చూశాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ తరహాలో 1వ తేదీ తెల్లవారుజామున పింఛను ఇచ్చిన దాఖలాలు గతంలో ఎన్నడూ లేవు. ప్రభుత్వం వలంటీర్ ద్వారా పింఛన్లు, నిత్యవసరాలు సైతం అందించి ఆదుకుంది. వలంటీర్లకు రుణపడి ఉంటాం.

– పెద్దక్క, పట్నం గ్రామం, కదిరి మండలం

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

- జగనన్నతో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు
- ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

కదిరి: 'వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలని జనం ఆతృతగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి ఇవే చివరి ఎన్నికలు. ఆ తర్వాత టీడీపీ కనుమరుగు కావడం ఖాయం' అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అన్నారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పట్టణంలోని 19వ వార్డులో చౌక్, పూలబజార్, బెస్తవీధి, అక్సా మసీదు వీధి, జౌక్‌పాళ్యం వీధుల్లో పర్యటించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను పలకరించారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. చంద్రబాబు హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు చెబితేనే సంక్షేమ పథకాలు అందేవని, జగనన్న పాలనలో అర్హత ఉంటే చాలు..పార్టీలు, కులాలు, మతాలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు వస్తున్నాయని ఎంతోమంది ఎమ్మెల్యేతో అన్నారు. వలంటీర్లు ప్రతినెలా 1వ తేదీన ఉదయాన్నే ఇంటికొచ్చి నిద్రలేపి మరీ పింఛన్లు ఇచ్చిపోతుంటే చంద్రబాబుతో పాటు పవన్‌కళ్యాణ్‌కు కడుపు మండిపోతోందని పలువురు మండిపడ్డారు. టీడీపీ, జనసేన పార్టీలకు వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా రాకుండా చిత్తు చిత్తుగా ఓడిస్తామని ఎంతోమంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఎమ్మెల్యే ఎదుట అన్నారు. ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. 19వ వార్డు కౌన్సిలర్ ఎం.రాజశేఖరాచారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, వైస్ చైర్మన్లు కొమ్ము గంగాదేవి, రాజశేఖర్‌రెడ్డి, కమిషనర్ శ్రీహరిబాబు, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ న్యాయం



బుక్కపట్నంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ,మండల ప్రత్యేక అధికారి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి



పుట్టపరి మండలం జగరాజుపల్లిలో...

గాండ్లపెంట: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని అధికారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జోరుగా సాగింది. దరఖాస్తు చేసుకున్నవారందరికీ 11 రకాల సర్టిఫికెట్లను అందజేశారు. గాండ్లపెంటలోని రెక్కమాను సచివాలయంలో 975 మందికి సర్టిఫికెట్లు అందజేశారు.

ధర్మవరం అర్బన్: జగనన్న సురక్షతో ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. ఇందిరమ్మకాలనీ కమ్యూనిటీ హాల్‌లో పలు వార్డులకు సంబంధించిన లబ్ధిదారులకు 4500 సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని సచివాలయ–2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 1469 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారం అవుతాయని బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సర్పంచ్ నాగలక్ష్మమ్మ,వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డితో కలిసి బుక్కపట్నం సచివాలయం–2లో సర్టిఫికెట్లు అందజేశారు.

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం జగరాజుపల్లి సచివాలయంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి పాల్గొని లబ్ధిదారులకు సేవా సర్టిఫికెట్లు అందజేశారు.

నల్లమాడ: స్థానిక గ్రామ సచివాలయంలో 1,704 మందికి 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అధికారులు, నాయకులు ఉచితంగా పంపిణీ చేశారు.

ఎన్‌పీకుంట: పెడబల్లి గ్రామసచివాలయంలో 898 సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన ధృవపత్రాలను అందించారు.

అమడగూరు: మహమ్మదాబాద్‌లో 913 సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

తాడిమర్రి: చిల్లవారిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి అర్హులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ముదిగుబ్బ(ధర్మవరం రూరల్): ముదిగుబ్బలోని సచివాలయం వద్ద జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేసి వలంటీర్‌ను సేవాపురస్కారంతో ఘనంగా సన్మానించారు.

చెన్నేకొత్తపల్లి: నాగసముద్రంలో ఎంపీపీ అంజలి పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు.



చెన్నేకొత్తపల్లి: సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం



ముదిగుబ్బలో వలంటీర్లకు సత్కారం

స్పెయిన్ కోచ్‌లతో శిక్షణ



క్రీడాకారులతో స్పెయిన్ బాస్కెట్‌బాల్ కోచ్‌లు

ధర్మవరం అర్బన్: స్పెయిన్ బాస్కెట్‌బాల్ కోచ్‌లతో ధర్మవరం క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఆర్డీటీ సహకారంతో మంగళవారం స్పెయిన్‌కు చెందిన ఈగల్ బాస్కెట్‌బాల్ క్లబ్‌కు సంబంధించిన కోచ్‌లు మౌర్, ఒరియోల్, నటాలియా, పోల్.. బాస్కెట్‌బాల్ క్రీడలో మెళకువలను నేర్పించారు. ఈనెల 30 వరకు ఈ శిక్షణ ఉంటుంది.

ఓటర్ల సర్వే పక్కాగా చేపట్టండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

కనగానపల్లి: ఈ నెల 21 నుంచి ఇంటింటా ఓటర్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ రమాదేవి బీఎల్‌ఓలను ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల సర్వే కార్యక్రమంపై బీఎల్‌ఓలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపులు, చేర్పులు, వివరాల మార్పులు కూడా చేపట్టాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీల ఎంపిక



జయచంద్రారెడ్డి



విద్యాసాగర్‌రెడ్డి



శివశంకర్‌రెడ్డి



వెంకటేశ్వరప్రసాద్‌స్వామి



చెన్నారెడ్డి

పుట్టపర్తి: ఓడీచెరువు మండలం వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీలను ఎంపిక చేశారు. గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా డబురువారిపల్లికి చెందిన జయచంద్రారెడ్డి, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా బోయపల్లికి చెందిన విద్యాసాగర్‌రెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా లింగాలవారిపల్లికి చెందిన ఎర్రబూదల శివశంకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ అధ్యక్షుడిగా చౌడేపల్లికి చెందిన వెంకటేశ్వరప్రసాద్ స్వామి, సేవాదళ్ అధ్యక్షుడిగా నల్లగుంటపల్లికి చెందిన చెన్నారెడ్డిను నియమించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన ఎద్దు, చిత్రంలో బాధిత రైతు రామాంజనేయులు

బత్తలపల్లి: వరి పంట సాగు కోసం పాకమాను తోలుతుండగా విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం పోట్లమర్రి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంగుమాలమ్మ పొలంలో అదే గ్రామానికి చెందిన దేవరకొండ రామాంజనేయులు తన ఎద్దులతో పాకమాను తోలుతుండగా ఎర్త్‌వైర్ తగిలి ఒక ఎద్దు కుప్పకూలింది. అప్రమత్తమైన రామాంజినేయులు రెండో ఎద్దును తప్పించి తాను కూడా తప్పించుకున్నాడు. గంగుమాలమ్మ కుమారుడు పోతలయ్య విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరాను నిలిపివేశారు. వ్యవసాయం కోసం రూ.1.30 లక్షలు వెచ్చించి ఎద్దులు కొనుగోలు చేశానని, ఇంతలోనే ఒక ఎద్దు మృతి చెందిందని యజమాని రామాంజినేయులు వాపోయాడు. బత్తలపల్లి ప్రాంతీయ పశువైద్యశాల ఏడీ శ్రీనివాసులు ఘటన స్థలానికి చేరుకుని కళేబరానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. ట్రాన్స్‌కో ఏఈ శివయ్య ప్రమాదఘటనపై ఆరా తీశారు.

నేతన్న నేస్తం లబ్ధిదారులతో నేడు భారీ ర్యాలీ

ధర్మవరం: పట్టణంలో బుధవారం నేతన్న నేస్తం లబ్ధిదారులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి కళాజ్యోతి సర్కిల్, పీఆర్‌టీ సర్కిల్, అంజుమన్ సర్కిల్, తేరుబజార్ మీదుగా కదిరిగేటు దగ్గర నున్న నేతన్న విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుంది. చేనేత కార్మికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పార్టీ అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు.

సెమిస్టర్ పుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎంఈఓలు

ధర్మవరం: ఆరో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలను మంగళవారం కోట మున్సిపల్ స్కూల్ నుంచి వివిధ పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరిలు అందించారు. గ్రామీణ ప్రాంతాలలో ఐదు పాఠశాలలు, పట్టణంలో 13 పాఠశాలలకు పుస్తకాలను పంపిణీ చేశామని ఎంఈఓలు తెలిపారు.

హెచ్‌బీ టెస్ట్‌లపై శిక్షణ

ప్రశాంతి నిలయం: ప్రభుత్వ ఆసుపత్రులకు మంజూరు చేసిన హెచ్‌బీ పరీక్షా యంత్రాల వినియోగంపై కమ్యూనిటీ హెల్త్ అధికారులకు మంగళవారం పుట్టపర్తి పీహెచ్‌సీలో ట్రైనర్లు మహబూబ్‌బాషా, సోహైల్ శిక్షణ ఇచ్చారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న కమ్యూనిటీ హెల్త్ అధికారులందరికీ దశల వారిగా శిక్షణ ఇస్తారని తెలిపారు. వైద్యుడు నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

నేడు ధనకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు



తనకల్లు: మండల పరిధిలోని కనసానివారిపల్లి సమీపంలో వెలసిన ధనకొండ గంగమ్మ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి మంగళవారం తెలిపారు. ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట జరిగిన 41 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టామన్నారు. భక్తులు విచ్చేసి గంగమ్మ తల్లి కృపకు పాత్రులు కావాలన్నారు. 19వ తేది ఉదయం నుంచి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఎంపీపీ రమణారెడ్డి

నల్లచెరువు: గొర్లవాండ్లపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి మంగళవారం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఎంపీపీ రమణారెడ్డి చేతుల మీదుగా గ్రామస్తులకు అందజేశారు.

దాడి కేసులో నిందితుడు అరెస్టు

బత్తలపల్లి: పోట్లమర్రి గ్రామంలో ఇంటి రస్తా విషయంలో దంపతులపై దాడిచేసిన కేసులో నిందితుడు ఓబులేశును అరెస్టు చేసినట్లు బత్తలపల్లి ఎస్‌ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు. రస్తా విషయంలో బొమ్మకం ఓబిలేసు, ఆదినారాయణరెడ్డి కుటుంబాల మధ్య గొడవ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సర్వే చేస్తుండగా ఓబిలేసు అడ్డుకున్నాడు. ఆదినారాయణరెడ్డి కుమారుడు, కోడలు వాగ్వాదానికి దిగగా వారిపై ఓబిలేసు దాడి చేశాడు. నిందితున్ని గోట్లూరు వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. ధర్మవరం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

నేటి నుంచి మొహర్రం వేడుకలు



బత్తలపల్లిలోని కాశీంస్వామి(ఫైల్)

బత్తలపల్లి: హిందూ ముస్లిలు కలిసికట్టుగా జరుపుకునే మొహర్రం పండుగకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి ఉత్సవాలు మొదలు కానుండటంతో గ్రామాల్లో సందడి నెలకొంది. బత్తలపల్లి, గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, లింగారెడ్డిపల్లి, సంజీవపురం, రాఘవంపల్లి, యర్రాయపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి, మాల్యవంతం, అప్రాచెరువు, తంబాపురం, గరిశలపల్లి, కోడేకండ్ల, ఓబుళాపురం, నల్లబోయనపల్లిలో హిందూ ముస్లింలు కలిసికట్టుగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలోని భగవతి అరవిందరెడ్డి అనే వ్యక్తి ఇంటిలో సోమవారం రాత్రి ఒక చెట్టుకు 9 బ్రహ్మకమలాలు వికసించాయి.

నేడు 'జగనన్న సురక్ష'

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి సచివాలయం–2లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అంజనప్ప మంగళవారం తెలిపారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

గాండ్లపెంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 2002–03 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పాఠశాలకు రూ.25వేల విలువైన మైక్‌సెట్‌ను హెచ్‌ఎం మధురాంబకు మంగళవారం అందజేశారు.

'వడ్డెర్లకు తెలుగుదేశం పార్టీ చేసింది శూన్యం'

పుట్టపర్తి టౌన్: టీడీపీ అధినేత చంద్రబాబు ఏనాడూ వడ్డెర్ల సంక్షేమానికి పాటుపడలేదని, పైగా రాజకీయంగా ఎదగకుండా అణగదొక్కారని వడ్డెర్ల సంఘం నాయకుడు ఉమా రాజు విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం జగనన్న వడ్డెర్లకు రెండు ఎమ్మెల్సీ, ఐదు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతో పాటు జెడ్పీటీసీలుగా పదవులు ఇచ్చారన్నారు. అలాంటి ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి వడ్డెర్ల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళీకి లేదన్నారు. వైఎస్సార్‌సీపీని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

డిగ్రీ ప్రవేశాలకు 20 నుంచి వెబ్‌ఆప్షన్

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకామ్, బీఎస్సీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 20 నుంచి వెబ్ ఆప్షన్ ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డా. స్మిత మంగళవారం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గీతానగర్‌కు చెందిన పోతలయ్య అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు... పోతలయ్య తన భార్య దుర్గతో మంగళవారం ఇంటి విషయంలో గొడవపడ్డాడు. అనంతరం ఇంటిలో ఉరివేసుకోగా అనంతపురం తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రీసర్వేపై రైతులకు అవగాహన

అమడగూరు: భూముల రీసర్వేపై ఓడీ చెరువు మండలంలోని వీరవోబనపల్లిలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. అధికారులు సర్వే నిమిత్తం వచ్చినప్పుడు రైతులు సహకరించి గట్లను చూపాలన్నారు.

నేడు 'గడప గడపకూ...

ఎన్‌పీకుంట: వంకమద్ది పంచాయతీతో పాటు సోమరాజుకుంటలో బుధవారం ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటిరాము, ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు.

రేపు గడప గడపకూ ....

గాండ్లపెంట: మునగలవారిపల్లి రోడ్డు నుంచి మునగలవారిపల్లి, కత్తివారిపల్లి, ఎనుములవారిపల్లి గ్రామాల్లో గురువారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ధర్మవరం అర్బన్: 29వ వార్డు సుందరయ్యనగర్‌లో జరుగుతున్న తాగునీటి పైపులైను, సీసీరోడ్లు నిర్మాణ పనులను కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ కోటిరెడ్డి బాలిరెడ్డి పరిశీలించారు. నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

మల్లూరమ్మకు బోనాలు



బోనాలు సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

అమడగూరు: ఓడీచెరువు మండలం నారప్పగారిపల్లిలో గ్రామదేవత మల్లూరమ్మకు మంగళవారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. మహిళలు ఇళ్లలో నైవేద్యాన్ని తయారు చేసి గంపల్లో ఉంచి వాటిని తలపై పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు.

8 వాహనాల సీజ్

అమడగూరు: ఓడిచెరువు మండలంలో ఎంవీఐ వరప్రసాద్ 8 వాహనాలను సీజ్ చేసి రూ.60వేల జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డులు లేని 8 వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించారు. ఎంవీఐ మాట్లాడుతూ వాహనదారులెవరైనా ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిందేనన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు.

నలుగురిపై కేసు నమోదు

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో భాస్కర్ అనే వ్యక్తి ఇంటిపై దాడి చేసిన నలుగురిపై రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ప్రేమ వివాహం చేసుకున్న జంటకు ఆశ్రయం కల్పించడంతో కక్షకట్టి ఈ నెల 13న ముదిగుబ్బ మండలం సిరిగారిపల్లికి చెందిన అనిల్, ఆదర్ష్, భారతీ, గోవర్ధన్‌లు ఇనుపరాడ్లు, కొడవండ్లతో తన ఇంటిపై దాడి చేశారని బాధితుడు ఫిర్యాదు చేశాడని పోలీసులు తెలిపారు.

కాలభైరవస్వామికి పూజలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచక్రవర్తి థియేటర్ సమీపంలోని స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో పూజారి ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అమావాస్య గడియల్లో దీపోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని గుమ్మడికాయలపై దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.